సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లోనూ తిరిగి పట్టం కట్టాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం 41వ డివిజన్ తోటపాళ్యం–2లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు.ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా మహిళల బ్యాంకు ఖాతాలకే సంక్షేమ లబ్ధిని జమచేయడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. పేద, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగనన్న అందిస్తున్న చేయూతపై ప్రజానీకం సంతోషంగా ఉందన్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కుప్పమ్మ, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ నాయకులు రమణ, రాజా, సీతాపతి, మనోహర్‌రెడ్డి, ధరణి, అంజాద్ పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

నేడు గడప గడపకు..

స్థానిక 39వ డివిజన్ పెద్దహరిజనవాడలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారు.

మా మద్దతు వైఎస్సార్ సీపీకే..


గుడిపాల: జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాలను ఇస్తున్న నాయకులు


యాదమరి : మాధవరం పంచాయతీలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ సురేష్‌బాబు


పూతలపట్టు : సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పార్టీ నాయకులు


పూతలపట్టు : గ్రామస్తులకు కరపత్రాలు ఇస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ నేతలకు చెప్పిన తేల్చి చెప్పిన ప్రజలు

గుడిపాల: మండలంలో నంగమంగళం, చెరువు ముందరవూరు, బొమ్మసముద్రం, గుడిపాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధిదారులు పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో నేరుగా సంక్షేమ పథకాలు పేదల ఇళ్లవద్దకే చేరుతున్నాయన్నారు. అనంతరం జగనన్న పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను లబ్ధిదారుల ఇళ్లకు అతికించారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ మద్దతు వైఎస్సార్ సీపీకేనని ప్రజలు నాయకులకు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయకోడి, రజనీకాంత్, కలైఅరసి, శిలంబరసన్, సాయి, రవి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మాధవరం పంచాయతీలో..

యాదమరి: వైఎస్సార్ సీపీ పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికలలో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీపీ సురేష్‌బాబు ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం మాధవరం పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, నాయకులు పాల్గొన్నారు.

అనంతాపురంలో..

పూతలపట్టు: రాబోయే ఎన్నికలలో మరొకసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని వ్యాపారవేత్త జగదీశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని అనంతాపురంలో నువ్వే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలతో మాట్లాడారు. అలాగే, పి.కొత్తకోట పంచాయతీలోని వడ్డిగుడిసెలు, టి.కే.పల్లెలో సర్పంచ్ పద్మజారాణి అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి, లబ్ధి పొందిన వారి గురించి తెలియజేశారు. గృహాలకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, సర్పంచ్ మాసిలామణి, ఎంపీటీసీ దేవిక, అమర్‌నాథరెడ్డి, లోకనాథరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోటుకనుమ పంచాయతీలో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. అనంతరం స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కరపత్రాలను అందజేశారు. రాబోయే ఎన్నికలలో కూడా జగన్ననకే మద్దతు పలుకుతామని గ్రామస్తులు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మాసిలామణి, సచివాలయ కన్వీనర్ కోదండ, శివకుమార్, గృహసారథులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల పంపిణీ


క్రికెట్ విజేతలకు నగదు అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: మండలంలోని మందిక్రిష్టాపురం పంచాయతీ పెరుమాళ్లకుప్పంలో యువత ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన ఉసురు గ్రామం యువత–శాత్తూరు యువతపై గెలిచింది. విన్నర్స్, రన్నర్స్‌కు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా రూ.20వేలు, రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సాయి, మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల్లో దైవభక్తి పెంపునకు ప్రచారం

తవణంపల్లె: ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడానికి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత– ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు ధనంజయులు తెలిపారు. మంగళవారం మండలంలోని మత్యం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, వేద గ్రంథాలపై ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. జీవాత్మ.. ఆత్మ.. పరమాత్మ..గురించి తెలుసుకోవడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన చేయడమే త్రైత సిద్ధాంత ముఖ్యఉద్దేశమన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం..సమాజంలో కులమతాల బేధాలను రూపుమాపడానికి, ప్రజల మధ్య అసమానతలు తొలగించడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునిరత్నం, హేమంత్, విమలమ్మ, జ్యోతీశ్వరి, కిరణ్, హర్షవర్ధన్, లలిత, చాముండి, విమలమ్మ, నాగమ్మ, సరళదేవి, ఛటర్జీ, వాణిశ్రీ, రేఖ, కల్యాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్లాంటు ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న నాయకులు

పూతలపట్టు: మండలంలోని మద్దులయ్యగారిపల్లెలో ఆదివారం తాగు నీటి ప్లాంటు ఏర్పాటుకు ఎల్‌బీవి అభయ సాయి సంస్థ అధినేత లోకేష్ రెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్లాంటు నిర్మాణ పనులకు 7 లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు ఆయన విలేకరులకు చెప్పారు. గ్రామస్తుల వినతిపై తమ సంస్థ ద్వారా ప్లాంటు పనులు పూర్తి చేస్తామని, పార్టీలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, సర్పంచ్ రామ తులసి, వైస్ సర్పంచ్ చంద్రరెడ్డి, బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తపోవనం ఆశ్రమానికి వితరణ

చిత్తూరు రూరల్: చిత్తూరులోని తపోవనం ఆశ్రమానికి 1990–91 పూర్వ విద్యార్థులు ఆదివారం జూషర్, టవర్ ఫ్యాన్స్ అందజేశారు. అలాగే దుస్తులు పంచారు. అనంతరం వారి మధ్య కేక్ కట్ చేశారు. పూర్వ విద్యార్థులంతా అక్కడ కాసేపు సరదాగా గడిపారు.

వేడుకగా శ్రీవారి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో హోమం చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్య పూజలు నిర్వహించారు. అనంతరం మూలవర్లను పాలు, పెరుగు, తేనె, నారికేళి, సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకించారు. పట్టు పీతాంబర వస్త్రాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కర్పూర హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం12 గంటలకు ఆలయ గర్భగుడి నుంచి శ్రీదేవి, భూదేవి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణమండపానికి మేళతాళాలతో వేంచేపు చేశారు. ఉభయదారులు తిరుపతికి చెందిన నాగరాజశర్మ, వసుంధరదేవి దంపతులను కంకణధారులను చేశారు. శ్రీవారికి ఎదురుగా శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలయ అర్చకుల బృందం బంతిచెండులను విసురుకున్నారు. అనంతరం నాట్యం చేసుకుంటూ రుత్వికులు శ్రీదేవి, భూదేవి విగ్రహాలను శ్రీవారి చెంతకు తీసుకొచ్చి ఆశీనులను చేశారు. ఉత్సవమూర్తుల ఎదుట హోమం నిర్వహించి శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణ చేశారు. శ్రీదేవి, భూదేవి మెడలో బ్యాండు వాయిద్యాల నడుమ మాంగల్యధారణ చేశారు. భక్తులు స్వామివారికి కానుకలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలపై మంత్రి పెద్దిరెడ్డికి వినతి


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలపై ఆదివారం తిరుపతిలోని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాష్ట్ర, జిల్లా ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం 3045 రాష్ట్ర నాయకులు కాశీ మధుబాబు, సుధాకర్, హేమకుమార్ పలు సమస్యలను మంత్రికి నివేదించారు. ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం పరిధిలో పనిచేస్తున్న 25వేల మంది కార్మికులకు నేరుగా వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈనెల 20న విజయవాడలో మంత్రి ఆధ్వర్యంలో ఉద్యోగులతో జరిగే పీఆర్సీ సమావేశంలో తగు నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లానాయకులు ప్రహ్లాదయ్య, రూప్‌కుమార్, సురేష్, దివాకర్, రాజు, గుణ, రెడ్డెప్ప, కిషోర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెరుమాళ్లకండ్రిగలో 'మహాభారత యజ్ఞం'

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలోని ద్రౌపదమ్మ ఆలయంలో ఆదివారం మహాభారత యజ్ఞం ధ్వజారోహణంతో మొదలయ్యాయి. మధ్యాహ్నం హరికథ ప్రారంభమైంది. రాత్రి స్వామివారిని గ్రామవీధుల్లో ఊరేగించారు. వారం రోజుల అనంతరం రాత్రి వీధినాటక ప్రదర్శనలు ప్రారంభమవుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


చెస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఆల్ చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ చదరంగం పోటీలు నిర్వహించింది. అండర్–17 బాలుర విభాగంలో లక్షిత్ కుమార్, లోహిత్ కుమార్, బాలికల విభాగంలో వర్షిణి, కౌసర్ విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారని అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ విలేకరులకు తెలిపారు. విజేతలు ఈ నెల 20న కృష్ణా జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

రేపు మండల సాధారణ సమావేశం

తవణంపల్లె: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు


రాజేష్‌శర్మకు స్వాగతం పలుకుతున్న ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని నేషనల్ బోర్డ్ ఆఫ్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ మెంబర్ ప్రొఫెసర్.రాజేష్ శర్మ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకటేశు ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఐరాల తహసీల్దార్ సుశీల, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

నేడు బండపల్లెలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

గుడిపాల: మండలంలోని బండపల్లెలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సుకన్య తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి రోగులను పరీక్షిస్తామని, గర్భిణులు, బీపీ, షుగర్ పేషెంట్లు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాజ వికాసానికి కళలు కరదీపికలు


కళాకారులను సత్కరిస్తున్న రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక –రంగస్థలి దినోత్సవాన్ని సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ నాట్య కళాపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ వికాసానికి కళలు కరదీపికలని, అలాంటి కళారంగంలో రాణిస్తూ కళామతల్లికి సేవలు అందిస్తున్న కళాకారులు అభినందనీయులని కొనియాడారు. అనంతరం నాటక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులు కె.రాధాకృష్ణ, మల్లికార్జునయ్య, కన్నెప్పగారి కేశవులురెడ్డి, నారాయణస్వామి, సుంకర సుబ్బారెడ్డి, జి.సుజన ఉత్తమ విశిష్ట సేవా పురస్కారాలు అందుకున్నారు. అలాగే రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో తెలుగు నాటక, రంగస్థలి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా రంగంలో రాణిస్తున్న కళాకారులు కస్పా పద్మనాభన్, జీఎస్ కోటేశ్వరరావు, మేకల గంగయ్య, భాస్కర్‌ను వీరేశలింగం సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, ఆమూరి సుబ్రమణ్యం, డి.గోపాల్, కె.సాయి నవీన్, సిద్ధేంద్రశర్మ, వెంకటరమణ, కార్యదర్శి కేఎస్.రాజా, కొత్తపల్లి శంకరయ్య, పొన్నాల జీజీరెడ్డి, వెంకట్రామయ్య, సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

వేసవికాలం వచ్చిందంటే అగ్నిప్రమాదాలు మామూలేగా అన్న మాటకు చరమగీతం పాడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తోంది. బహుళ అంతస్తుల భవనాలు, స్కూళ్లు, కళాశాలలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ తరహా భవన సముదాయాల్లో ఉండే వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- పుత్తూరులో ఆరేళ్లలో అగ్ని ప్రమాదాలు 260
- ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 3
- వేసవిలో జాగ్రత్తలు పాటించాలంటున్న అగ్నిమాపకశశాఖ అధికారులు
- ఏటా వారోత్సవాల సందర్భంగా మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన


పుత్తూరు అగ్నిమాపక కేంద్రం



పుత్తూరు రూరల్: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి ? ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోని భవనాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా ఉన్నాయా ? లేదా ? అనే అంశంపై ఆడిటింగ్ చేయడంతో పాటు ఆయా యాజమాన్యాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. పుత్తూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, పిచ్చాటూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలు ఉన్నాయి. గడచిన ఆరేళ్లలో పుత్తూరు ఫైర్ స్టేషన్ పరిధిలో 260 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోగా ముగ్గురు మృత్యువాత పడ్డారు. రూ.3 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరగ్గా, మరో రూ.3 కోట్ల మేర ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ప్రమాదాల నుంచి 14 మంది ప్రాణాలను అగ్నిమాపక సిబ్బంది రక్షించగలిగారు.

అవగాహన కోసమే వారోత్సవాలు

1944 ఏప్రిల్ 14న ముంబైలోని విక్టోరియా పోర్టులో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగింది. మృతుల సంస్మరణార్థం ఏటా ఏప్రిల్ 14 నుంచి 7 రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. ఈ వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు, జాగ్రత్తలపై ప్రజలకు అధికారులు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తారు.

పంట ప్రమాదాలపై దృష్టి సారించాలి

వేసవిలో చెరుకు తోటల దగ్ధం వార్తలను వింటూనే ఉంటాం. ఈ ప్రమాదాలు పంట పొలాలపై వెళ్లే విద్యుత్ తీగల కారణంగా జరిగినట్లు రైతులు చెబుతుంటారు. ఒకసారి చెరుకు తోటకు అగ్గి రాసుకుంటే, దాన్ని అదుపు చేయడం కష్టతరం. క్షణాల్లో పంట మొత్తం కాలి బూడిద అవుతుంది. చెరుకు మర్దాం పంట కోసం రైతులే పంటలకు నిప్పు పెడుతుంటారు. ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పక్కతోటలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటిపై అగ్నిమాపక సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుత్తూరు అగ్నిమాపక పరిధిలో ప్రమాద వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తి నష్టం	కాపాడినది	ప్రాణనష్టం	కాపాడినది
2017-18	53	62,00,523	45,58,600	0	0
2018-19	48	59,06,000	50,00,000	0	0
2019-20	33	45,65,333	35,05,000	0	0
2020-21	43	55,96,000	36,78,500	0	7
2021-22	25	27,35,000	45,70,000	2	2
2022-23	58	63,92,000	1,28,58,000	1	5
మొత్తం	260	3,13,94,856	3,41,70,100	3	14

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో మెలగాలి. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా భవన సముదాయాల వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నాం. చిన్నపాటి అలసత్వంతోనే ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లుతుంది. స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు మేము చెప్పిన సూచనలు పాటించడం ద్వారా విలువైన ఆస్తులు, ప్రాణాలను కాపాడుకోవచ్చు. చిన్నపిల్లలకు అందుబాటులో ఉండేలా అగ్గిపెట్టెలు, టపాకాయలు ఉంచరాదు.

– నేతాజి, పుత్తూరు ఫైర్ ఆఫీసర్


మాక్‌డ్రిల్ ద్వారా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో 'స్పందన'

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.అలాగే నగరంలో 50 డివిజన్లలోని వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందని..ఆయా డివిజన్ల స్థానికులు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ ఫోన్: 08572232745, వాట్సప్–9849907885 నంబర్లకు సమస్యలు తెలియజేయాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరులోని తమ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ప్రజలు సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

నగరి : రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా సోమవారం సాయంత్రం 5 గంటలకు నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. నియోజకవర్గంలోని ముస్లింలు, మహిళలు తన ఆహ్వానాన్ని స్వీకరించి విందులో పాల్గొనాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.